ప్రమిదలు @ వీరవల్లి



మట్టితో తయారు చేసిన పాత్రలు

● ఏటా వీరవల్లిలో 25 లక్షల మట్టి ప్రమిదల తయారీ ● రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాలకు తరలింపు ● ఇక్కడి ప్రమిదలకు పొరుగు రాష్ట్రాల్లోనూ డిమాండ్



మట్టి ప్రమిదలు తయారు చేస్తున్న సీతారామయ్య

హనుమాన్‌జంక్షన్ రూరల్: దీపావళి అంటే దీపాల పండుగ.. ఆ దీపాలను వెలిగించేందుకు మట్టి ప్రమిదలను వాడుతుంటాం.. ఆ మట్టి ప్రమిదల తయారీకి బాపులపాడు మండలం వీరవల్లి ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడి శాలివాహనుల ప్రమిదలకు పొరుగు రాష్ట్రాల్లోనూ డిమాండ్ ఎక్కువ. ఏటా దీపావళికి వీరవల్లిలో 25 లక్షల ప్రమిదలు తయారవుతాయి. రాష్ట్రంలోని పలు ముఖ్య పట్టణాలు, పొరుగు రాష్ట్రాలకు కూడా వీరవల్లి శాలివాహనుల ప్రమిదలు తరలిస్తుంటారు.

ఏటా లక్షల్లో తయారీ..

బాపులపాడు మండలం వీరవల్లిలోని శాలివాహనులు దీపావళి పండుగకు ఏటా సుమారు 25 లక్షలపై చిలుకు ప్రమిదలను సిద్ధం చేస్తుంటారు. దీని కోసం దాదాపు రెండు నెలల పాటు రేయింబవళ్లు శ్రమిస్తారు. ప్రతి ఏటా వినాయక చవితి తర్వాత ప్రమిదల తయారీని శాలివాహనులు మొదలు పెడతారు. ఇంటిల్లిపాదీ రోజుకు సగటున వెయ్యి ప్రమిదల వరకు తయారు చేస్తుంటారు. దీని కోసం ప్రత్యేకంగా మట్టిని సిద్ధం చేసుకుని కుమ్మరి చక్రంపై ప్రమిదలను మగవాళ్లు తయారు చేయగా, ఆ కుటుంబంలోని ఆడవాళ్లు వాటిని ఎండలో ఆరబెట్టడం, బట్టీలో కాల్చటం, ప్యాకింగ్ వంటి పనులు చేస్తుంటారు.

ముందుగానే ఆర్డర్లు..

వీటిని దీపావళికి నాలుగైదు రోజులు ముందుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు తీసుకువెళ్లి విక్రయిస్తుంటారు. కొందరు వ్యాపారులు ఆర్డరు చెప్పి, వీరవల్లికి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. దీపావళి సీజన్‌లో ఒక్కో శాలివాహన కుటుంబం కనీసం 50 వేల ప్రమిదలను తయారు చేస్తారు. మరో వైపు ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ దీపాలు మార్కెట్‌లోకి విరివిగా రావటంతో మట్టి ప్రమిదల కొనుగోళ్లు గతంతో పోల్చితే గణనీయంగా తగ్గాయి. హోల్‌సేల్ ధరలకు వెయ్యి ప్రమిదలను రూ.1200 చొప్పున ఇక్కడ విక్రయిస్తున్నారు.

మట్టి వస్తువులకు ప్రాణం పోసి..

వీరవల్లిలోని శాలివాహన కాలనీలో సుమారు 60 కుటుంబాలు ఉన్నాయి. దశాబ్దాలుగా వీళ్లంతా మట్టితో రకరకాల వస్తువులు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మట్టి ప్రమిదలే కాకుండా ఏడాది పొడవునా రకరకాల మట్టి వస్తువులను ఎంతో ఆకర్షణీయంగా తయారు చేస్తుంటారు. మట్టి వంట పాత్రలు, పెరుగు తోడు పెట్టే కుండలు, మంచినీళ్ల కూజాలు, కుండలు, ముంతలు. ధూపం కుందెలు, పూల కుండీలు, అలంకరణ సామగ్రి, టీ కప్పులు, గ్లాసులు వంటివి తయారు చేస్తారు.

ఇంటిల్లిపాదికీ ఆధారం



మట్టి ప్రమిదలు, మట్టి సామాన్ల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నాం.దాదాపు40 ఏళ్లుగా నాభర్త సీతారామయ్య, నేను కుమ్మరి వృత్తిని కొనసాగిస్తున్నాం. మట్టి వస్తువుల వినియోగం బాగా తగ్గిపోవటం, అంతంతమాత్రంగా రేట్లు దక్కటంతో జీవనం కష్టతరంగా మారింది. ప్రభుత్వ ప్రోత్సాహం, సబ్సిడీ రుణాలు అందించి ఆదుకోవాలి.

– చెరుకుమల్లి రాధ, వీరవల్లి

సరైన ధర దక్కటం లేదు..



దీపావళి పండుగకు రెండు నెలలు ముందు నుంచే ప్రమిదల తయారీ మొదలు పెడతాం. వీరవల్లి, నూజివీడు ప్రాంతం నుంచి మట్టిని తీసుకువచ్చి, ప్రమిదలను సిద్ధం చేస్తున్నాం. రవాణా చార్జీలు, బట్టీలో కాల్చేందుకు కట్టెల రేట్లు బాగా పెరిగాయి. మట్టి ప్రమిదలకు సరైన ధర దక్కటం లేదు. వ్యాపారులు వెయ్యి ప్రమిదలను రూ.1200కు మా వద్ద కొనుగోలు చేస్తున్నారు.

– యనగంటి వెంకటేశ్వరరావు, వీరవల్లి

ఈ వృత్తిలోకి రావటం లేదు..



మా తరంతోనే మట్టి పాత్రలు తయారు చేసే చేతివృత్తి ముగిసిపోతుంది. మా తర్వాతి తరం వాళ్లు ఈ వృత్తిపై అంతగా ఆసక్తి చూపటం లేదు. మట్టి సామాన్లు వినియోగం తగ్గటం, సరైన ధరలు లేకపోవటంతో ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల వైపు వెళ్లిపోతున్నారు. భవిష్యత్‌లో మట్టి పాత్రలు చేసే కుమ్మరి చేతివృత్తిదారులు గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉంది.

– యనగంటి శ్రీను, వీరవల్లి

క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పెనమలూరు: విద్యార్థులకు డ్రగ్స్ పట్ల అవగాహన ఉండాలని, ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని టాస్క్‌ఫోర్స్ సీఐ రవికుమార్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కారాదన్నారు. తల్లితండ్రులు కూడా పిల్లలపై దృష్టి పెట్టాలని సూచించారు. డాక్టర్ స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలను ప్రభుత్వం నిషేధించిందని, అవి చాలా ప్రమాదకరమని తెలిపారు. ఇవి సేవిస్తే మానసిక వ్యాధులు వస్తాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ వాసవి, నెహ్రూ యువ కేంద్రం అధికారి సుంకర రాము, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, కో ఆర్డినేటర్ వినోద్‌కుమార్, పలువురు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే సక్రమంగా నిర్వహించండి



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో సిబ్బంది చేపట్టిన సమగ్ర సర్వేను సమర్థవంతంగా చేయాలని కమిషనర్ భవానీప్రసాద్ అన్నారు. కమిషనర్ శనివారం కానూరు– 2 సచివాలయం పరిధిలో సమగ్ర సర్వేను పరిశీలించారు. కమిషనర్ భవానీప్రసాద్ మాట్లాడుతూ సమగ్ర సర్వేతో మున్సిపాలిటీ పరిధిలో పన్నులు సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలిస్తామన్నారు. కొత్తగా పన్నులు వేయటం, హెచ్చు తగ్గులు ఉన్న పన్నులు సరిచేయటం, వాణిజ్య లైసెన్సులు విధించటం చేస్తామన్నారు. అదే విధంగా ప్లాన్‌ల మంజూరు, ప్లాన్లు లేని ఇళ్లను, సముదాయాలను గుర్తిస్తామన్నారు. మున్సిపాలిటీ సిబ్బంది చేస్తున్న సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పెనమలూరు: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అందజేశారు. పోరంకిలో తన కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పెనమలూరు నియోజకవర్గం పరిధిలో పలువురికి మంజూరైన రూ.24,44,761 విలువైన చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. వైద్య సేవల కోసం ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేస్తే న్యాయం చేస్తానన్నారు.

ఆటల పోటీలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శనివారం ఫన్ అండ్ ఫ్లోరిక్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా నర్సరీ నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులకు పలు రకాల ఆటల పోటీలను నిర్వహించారు. ఏడుపెంకులాట, బొంగరాల ఆట, మూడు కాళ్ల బంధం, అష్టాచెమ్మా, వైకుంఠపాళి, కర్రాబిళ్ల వంటి సంప్రదాయ ఆటల్లో తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజు, ప్రిన్సిపాల్ భువనేశ్వరన్, డైరెక్టర్లు పరిమి పవన్ చంద్, కడియాల ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా 'దీపావళి' దుకాణాల ఏర్పాటు పనులు

కంకిపాడు: దీపావళి టపాసుల విక్రయ దుకాణాల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. కంకిపాడు పట్టణంలో దీపావళి మందుగుండు సామగ్రి విక్రయాల నిమిత్తం దాఖలు చేసుకున్న అర్జీదారులకు దుకాణాల కేటాయింపునకు కంకిపాడు అయానా ఫంక్షన్ హాలు పార్కింగ్ ప్రదేశాన్ని అధికారులు గుర్తించారు. అధికారుల సూచనలకు అనుగుణంగా లైసెన్సు దారులు దుకాణాల ఏర్పాటు పనులు చురుగ్గా చేపట్టారు. దీపావళి పర్వదినం సందర్భంగా టపాసుల విక్రయాలకు అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. దీంతో షాపుల ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి.

సెంట్రల్ జోన్ కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న ఎస్సార్కే కళాశాల విద్యార్థులు

రామవరప్పాడు: జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 24, 25న కంచికచర్లలోని మిక్ కళాశాలలో నిర్వహించిన సెంట్రల్ జోన్ కబడ్డీ మెన్స్ టోర్నమెంట్ పోటీల్లో ఎనికేపాడులోని ఎస్సార్కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రథమ బహుమతి సాధించారని కళాశాల ఛైర్మన్ బోయపాటి అప్పారావు తెలిపారు. ఎస్సార్కే కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా బోయపాటి అప్పారావు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌కు జేఎన్‌టీయూ పరిధిలో ఉన్న 45 కళాశాలల నుంచి 45 జట్లు పాల్గొన్నాయన్నారు. ఈ టోర్నమెంట్‌లో ఎస్సార్కే కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి అందుకున్నారని తెలిపారు. అనంతరం జేఎన్‌టీయూ కాకినాడ టీమ్‌ను సెలెక్ట్ చేయగా అందులో కూడా కళాశాల విద్యార్థులు 11 మంది ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి జేఎన్‌టీయూ టీమ్‌కు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ శ్రీ కృష్ణ, ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు, స్పోర్ట్స్ కౌన్సిల్ జేఎన్‌టీయూ కాకినాడ సెక్రటరీ శ్యామ్ కుమార్, డైరెక్టర్ సీహెచ్ శరత్ అభినందనలు తెలియజేశారు.

గుడి, బడి సమీపంలో వైన్‌షాపులను తొలగించాలి



ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి

గన్నవరం: నిబంధనలకు విరుద్ధంగా గుడి, బడికి సమీపాల్లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను తొలగించాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ఎక్సైజ్ అధికారులను కోరారు. శనివారం స్థానిక ఎక్సైజ్ సీఐ డీ సురేఖను కలిసిన ఆమె వినతిపత్రం అందజేశారు.జెడ్పీటీసీ మాట్లాడుతూ.. స్థానిక కోనాయి చెరువు వద్ద శివాలయం పక్కనే వైన్‌షాపు ఏర్పాటుకు అనుమతించడం సరికాదన్నారు. వీఎన్.పురంరోడ్డు పక్కనే మద్యం దుకాణం ఉండడంతో మహిళలు, విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. పర్మిట్ రూమ్ అనుమతి లేకపోయినా వైన్‌షాపు వద్దే బహిరంగంగా మద్యం సేవిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దావాజిగూడెం రోడ్డులో సెయింట్‌జాన్స్ హైస్కూల్, చైతన్య జూనియర్ కళాశాల పక్కనే ఏర్పాటు చేసిన వైన్‌షాపును తొలగించాలని కోరారు. జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల మహిళలుఅభద్రతకు గురవుతున్నారన్నారు. దోమవరపు నిర్మల, సుమన్, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రణాళిక



పోలీసులతో మాట్లాడుతున్న నిపుణులు

పెనమలూరు: విజయవాడ నగరంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ సివిల్ విభాగం శనివారం ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. కాలేజీ సివిల్ విభాగం హెడ్ డాక్టర్ వేంగల జగదీష్, రవాణా ఇంజినీరింగ్ నిపుణుడు శ్యామ్‌ప్రకాష్ నేతృత్వంలో చిట్టినగర్, సితార జంక్షన్, వై జంక్షన్ వంటి తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఉన్న ప్రాంతాలను విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులతో కలిసి విశ్లేషించారు. కొత్త మార్గాల నిర్వాహణతో సౌలభ్యాన్ని మెరుగుపరిచే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించటం, భద్రతను మెరుగుపర్చడం, తదితర అంశాలపై ప్రతిపాదనలు చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు మాట్లాడుతూ ట్రాఫిక్ విభాగానికి గణనీయమైన డేటా, కార్యరూపక పథకాలు, సురక్షిత ప్రయాణంపై తమ కాలేజీ ఫ్యాకల్టీ, విద్యార్థులు సేవలందించారన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలని సూచించారు.

ధాన్యం సేకరణపై అవగాహన



ఉంగుటూరులో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్, ఏవో



ధాన్యం నాణ్యతను పరీక్షించే పద్ధతులను వివరిస్తున్న టీఏ

ఉంగుటూరు: రైతులు తమ ధాన్యాన్ని ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా తమకు నచ్చిన మిల్లుకి తరలించి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నమోదు చేసుకోవచ్చని తహసీల్దార్ విమలకుమారి అన్నారు. ఉంగుటూరు వ్యవసాయ కార్యాలయంలో ధాన్యం సేకరణపై ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు దళారుల వద్ద మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధరను అందిస్తోందని చెప్పారు. ధాన్యం తేమ శాతం, ఆన్‌లైన్ ప్రక్రియ, రైతులకు సంచులు అందించి, మిల్లుకు రవాణా చేసే వరకు సిబ్బంది బాధ్యతగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి వి.హరీష్‌కుమార్, ఏఈవో బి.దుర్గా నాగేశ్వరరావు, వీఏఏలు, పీఏసీఎస్ ఇంచార్జులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

16 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలో 16 ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఏవో జొన్నలగడ్డ భవాని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నాణ్యతను పరీక్షించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, పీఏసీఎస్ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల వ్యవసాయాధికారి కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ టెక్నికల్ అసిస్టెంట్లు పి.సురేష్ బాబు, ఎం.వంశీకృష్ణ, పి.లేఖశ్రీలు హాజరై ధాన్యం నాణ్యత పరీక్షల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఏవో భవాని మాట్లాడుతూ ఈ– క్రాప్, ఈకేవైసీ నమోదు చేస్తున్న రైతుల నుంచి మాత్రమే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయాలు జరుగుతాయని చెప్పారు. సాధారణ రకం ధాన్యం క్వింటాలు ధర రూ.2300 కాగా, ఎ–గ్రేడ్ ధాన్యం క్వింటాలు ధర రూ.2320గా ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆమె వివరించారు. మండలంలోని 16 రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రేపు సీపీఎం నేతల పాదయాత్ర

కంకిపాడు: అధ్వానంగా ఉన్న రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.రంగారావు డిమాండ్ చేశారు. స్థానిక మండేపూడి భవన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రంగారావు మాట్లాడుతూ కంకిపాడు–మానికొండ– గుడివాడ రోడ్డు మార్గం గోతులమయంగా అధ్వానంగా ఉందన్నారు. ప్రమాదాలకు రహదారి నెలవుగా మారిందన్నారు. రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోడ్డు అభివృద్ధి కాంక్షిస్తూ ఈనెల 28న కోమటిగుంట లాకుల నుంచి మానికొండ మీదుగా గుడివాడ వరకూ పాదయాత్ర సాగుతుందన్నారు. పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తాడంకి నరేష్, నాయకులు కె.నాంచారయ్య, ఇతర నేతలు పాల్గొన్నారు.

పశుగణనతో రైతులకు ఎంతో మేలు

గన్నవరం రూరల్: మండలంలోని గోపవరపుగూడెం గ్రామంలో శనివారం పశుగణన కార్యక్రమం గొల్లనపల్లి పశుచికిత్సా కేంద్రం డాక్టర్ రెడ్డెమ్మ ప్రారంభించారు. 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ పశువుల వివరాలు తెలుసుకునేందుకు సేకరణ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సర్పంచ్ నల్లూరి వెంకటేశ్వరరావు పశుగణన పోస్టరు ఆవిష్కరించారు. 300 గొర్రెలకు, 150 మేకలకు డీవార్మింగ్ మందును డాక్టర్ రెడ్డెమ్మ ఆధ్వర్యంలో వెటర్నరీ సిబ్బంది శ్రీనివాస్ తదితరులు అందించారు. రైతులు వేమూరి రవి, నల్లూరు వెంకటరత్నం, నల్లూరు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పశువులకు వైద్య సేవలు

ఉయ్యూరు: మండలంలోని చిన ఓగిరాలలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ సత్యసాయి బాబా భజన మండలి, పశుసంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సర్పంచ్ వెనిగళ్ల శిరీష ప్రారంభించారు. పశుపోషకులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ వీణా, డాక్టర్ వేణు వైద్య సేవలు అందించారు. ఏడీఏ రామశేఖర్ శిబిరాన్ని పర్యవేక్షించారు. భజన మండలి సభ్యులు శ్రీరాములు, లీలాకృష్ణ చంద్రశేఖర్, పాల్గొన్నారు.

తల్లీకుమార్తె అదృశ్యం

పెనమలూరు: తల్లీకుమార్తె అదృశ్యమైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. వాటపల్లి నాగలక్ష్మి కుటుంబ సభ్యులతో పోరంకి చేపల కుండీల వద్ద ఉంటుంది. ఆమె కుమార్తె కన్నా తిరుమల గత కొద్ది సంవత్సరాల క్రితం నాగభూషణంకు ఇచ్చి వివాహం చేసింది. భార్యభర్తకు మధ్య గొడవలు రావటంతో తిరుమల, ఆమె కుమార్తె (7) తల్లి నాగలక్ష్మి వద్దే ఉంటున్నారు. అయితే శుక్రవారం నాగలక్ష్మితన మనమరాలిని ఎందుకు కొట్టావని కుమార్తె తిరుమలను మందలించి ఆ తరువాత బయట పనికి వెళ్లింది. అయితే కొద్ది సమయం తరువాత తిరుమల స్కూల్‌లో చదువుతున్న కుమార్తెకు క్యారేజ్ ఇచ్చి వస్తానని ఇంటి నుంచి వెళ్లింది. అయితే తిరుమల ఇంటికి రాక పోవటంతో స్కూల్‌లో ఉన్న మనమరాలి వద్దకు అమ్మమ్మ నాగలక్ష్మి వెళ్లగా మధ్యాహ్నం తిరుమల వచ్చి కుమార్తెను తీసుకు వెళ్లిందని స్కూల్ యాజమాన్యం తెలిపింది. తిరుమల ఇంట్లో నుంచి బయటకు వెళ్లే సమయంలో ఇంట్లో రూ.50 వేలు, 8 కాసుల బంగారం, మనమరాలితో మాయమైందని తల్లి నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'కోపా' స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న డాక్టర్ కైలాసరావు తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కులమతాలకు అతీతంగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించేందుకు కాపు అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(కోపా) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోపా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ దావులూరి కైలాసరావు, డి.రమేష్ కుమార్ తెలిపారు. విజయవాడ ముత్యాలంపాడులో శనివారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కోపా గత 27 ఏళ్లుగా ఉమ్మడి కృష్ణా జిల్లాలకు చెందిన మెరిట్ విద్యార్థులను గుర్తించి ఏటా ఉపకార వేతనాలు అందజేసి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. తమ వద్ద ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులే దాతలుగా మారి కోపాకు సహకరించటం సంతోషంగా ఉందన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడిసిన్, డిప్లమో తదితర కోర్సులు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు kopakrishnavja@gmail.com కు అభ్యర్థన పంపితే దరఖాస్తు పంపిస్తామని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులకు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జత చేసి వచ్చే నెల 20వ తేదీలోపు పంపించాలని సూచించారు. మరింత సమాచారం కోసం 94402 39989, 70936 39919 నంబర్లు, ఈ మెయిల్ ఐడీల ద్వారా సంప్రదించాల్సిందిగా కోరారు. కోపా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి సంజీవ్, కోశాధికారి గాజుల రామారావు, ఎక్స్ అఫీషియో సభ్యులు కొప్పరాతి వెంకట రమణారావు, రామాయణం నాగసత్యం, గల్లా భాస్కర్ రావు, బెల్లం సత్యనారాయణ, పులుగుజ్జు ప్రసాద్, బీవీ సుధాకర్ పాల్గొన్నారు.

'దీపావళి' నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఆర్డీవో బీఎస్ హేలా షారోన్

ఉయ్యూరు: దీపావళి దుకాణదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో బీఎస్ హేలా షారోన్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలో దీపావళి టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే వీరమ్మతల్లి ఆలయ ప్రాంగణాన్ని శనివారం ఆమె పరిశీలించారు. దుకాణాల ఏర్పాటు, అనుమతుల మంజూరు, భద్రతాచర్యలపై సమీక్షించారు. ఆర్డీవో షారోన్ మాట్లాడుతూ దుకాణదారులు నియమ నిబంధనలకు లోబడి దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి దుకాణదారుడు ఖచ్చితంగా భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సురేష్‌కుమార్, సీఐ రామారావు, ఆర్ఐ యతీంద్ర, సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గన్నవరం: ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. నెల్లూరు జిల్లా కావలి మండలం కందులవారిపాలెంకు చెందిన కోట అఖిల్‌రెడ్డి(40), గన్నవరానికి చెందిన ఓ యువతిని 13 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం భార్యతో గొడవ పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి అల్లాపురంలోని స్నేహితుడి ఇంటికి వెళ్లిన అఖిల్‌రెడ్డి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి స్నేహితుడు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

1న విజయవాడలో ఎమ్మార్పీఎస్ సదస్సు

నున్న(విజయవాడరూరల్): నవంబరు 1వ తేదీన విజయవాడలో జరిగే ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కృష్ణా జిల్లా సదస్సును విజయవంతం చేయాలని మందా వేణు మాదిగ విజ్ఞప్తి చేశారు. శనివారం నున్నలో విజయవాడ రూరల్ మండల ఎమ్మార్పీఎస్ నేతల సమావేశంలో మాట్లాడారు. సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విచ్చేస్తున్నారన్నారు. తగరం సుబ్బారావు అధ్యక్షతన సమావేశంలో ఎంఎస్ఎం గన్నవరం కో ఇన్‌చార్జ్ చిల్లిముంత కోటేశ్వరరావు మాదిగ, పొరిటిగడ్డ దేవదాసు మాదిగ, తగరం విజయకుమార్ మాదిగ, గద్దం నవీన్‌మాదిగ, తగరం పుష్పనాథం మాదిగ పాల్గొన్నారు.

ఉద్యోగులకు కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరం



గెలుపొందిన విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న శ్రీనివాసరావు

పెనమలూరు: ఆంగ్ల భాషపై పట్టు ఉంటేనే కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయని కమ్యూనికేషన్ నిపుణుడు జి.శ్రీనివాసరావు అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో శనివారం పీవీపీలో ఫ్రెషమాన్ లిటరటీ ఫెస్టు– 2024 ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగంలో రాణించాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా అవసరమన్నారు. కేవలం భాషపై పట్టు ఉంటేనే అది సాధించగలుగుతామని వివరించారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు మాట్లాడుతూ సాంకేతిక సంస్థల్లో భాషకు ప్రాధాన్యం ఇవ్వటం వలన సృజనాత్మక ఆలోచనలు విస్తృతం చేయటానికి ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.